# నేడే పోలింగ్

- అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5దాకా పోలింగ్
- మంథనిలో సాయంత్రం 4 గంటల వరకే
- జిల్లా పరిధిలోని 3 అసెంబ్లీ స్థానాల బరిలో 61 మంది అభ్యర్థులు
- జిల్లాలో 7,11,727 మంది ఓటర్లు
- జిల్లావ్యాప్తంగా 838 కేంద్రాలు
- జిల్లాలో 289 సమస్యాత్మక కేంద్రాలు
- విధుల్లో సుమారు 9వేల మంది సిబ్బంది
- మూడు వేల పోలీసు బలగాలతో భద్రతా ఏర్పాట్లు
- అమల్లో 144 సెక్షన్
- ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో 2ఈవీఎంలు
- కొత్త ఓటర్ల కోసం 3 యూత్ పోలింగ్ కేంద్రాలు

పెద్దపల్లి, నవంబర్ 29(నమసే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికలకు అంతా సిద్ధమైంది. గురువారం జిల్లాలోని మూడు నియోజకవర్గాలు పెద్దపల్లి, రామగుండం, మంథనిలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 7, 11, 727 మంది ఓటర్లు ఉండగా 61మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మూడు నియోజకవర్గాల్లో మొత్తంగా 838 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆధ్వర్యంలో పోలింగ్ సెంటర్లలో ఏర్పాట్లు చేశారు. పెద్దపల్లి, మంథని, రామగుడం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి ఒక్కో పోలింగ్‌స్టేషన్‌కు ఒక్కో ప్రత్యేక వాహనంలో పోలీసు భద్రత నడుమ ఎన్నికల సిబ్బంది, సామగ్రిని చేరవేశారు. సిబ్బంది ఈ రాత్రి అక్కడే బస చేస్తారు. గురువారం ఉదయం నుంచే ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. మూడు నియోజకవర్గాల్లో 3352 మంది విధులు నిర్వర్తించనున్నారు. మరో 6 వేల మంది సహాయక, పోలీస్ సిబ్బంది పనిచేయనున్నారు. 115 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉండగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. సిబ్బంది ఎన్నికలు పూర్తయిన తర్వాత పోలింగ్ స్టేషన్లలో కలెక్టింగ్ చేపట్టి ఈవీఎంలను పోలీసు భద్రతా నడుమ రామగిరి మండలం జేఎన్టీయూలో జరిగే కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తారు.

### మాక్ పోలింగ్..

జిల్లాలోని 838 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు మాక్ పోలింగ్‌ను నిర్వహించనున్నారు. ఏజెంట్ల సమక్షంలో ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. మంథని నియోజకవర్గంలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4లోగా పూర్తి చేస్తారు. కాగా పెద్దపల్లి, రామగుండంలో మాత్రం 5 గంటల వరకు ఓటింట్ నిర్వహిస్తారు. మంథని నియోజకవర్గంలో పెద్దపల్లి జిల్లా పరిధిలోని మంథని, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి మండలాలు, భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాటారం, మహాదేవపూర్, మల్హార్, మహాముత్తారం, పలిమెల మండలాల్లోనూ ఎన్నికలు నిర్వహిస్తారు.

### పెద్దపల్లిలో 290 పోలింగ్ కేంద్రాలు

పెద్దపల్లి నియోజకవర్గంలో 2,54,266 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,26,046, స్త్రీలు 1,28,212 ఇతరులు 8మంది. 17 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా 290 పోలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిని 26 సెక్టార్లు గా, 36 రూట్లుగా విభజించారు. ఒక్కో సెంటర్‌కు ఒక పోలింగ్, సహాయర, ఇద్దరు చొప్పున ఇతర పోలింగ్ అధికారులతో పాటు ఒక బూత్‌లెవల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి, ఓటరు సహాయ కేంద్రం, ఏఎన్ఎం, ఇద్దరు పోలీసులు అందుబాటులో ఉండనున్నారు. ఈ నియోజకవర్గంలో 44 సమస్యాత్మక సెంటర్లు ఉండగా ప్రత్యేక భద్ర తా ఏర్పాట్లు చేశారు. 116 మంది అధికారులు, సిబ్బందిని రిజర్వుగా ఉంచారు.

### రామగుండంలో 260...

రామగుండం నియోజకవర్గంలో మొత్తంగా 2,21,019 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,11,200 మంది, స్త్రీలు 1,09,794, ఇతరులు 25మంది. ఇక్కడ 23మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 260 పోలింగ్ కేం ద్రాలను ఏర్పాటు చేశారు. 24 సెక్టార్లుగా 24 రూ ట్లుగా విభజించారు. ఒక్కో సెంటర్‌కు ఒక పోలింగ్, సహాయ, ఇద్దరు చొప్పున ఇతర పోలిం గ్ అధికారులతో పాటుగా ఒక బూత్‌లెవల్ ఆఫీస ర్ పంచాయతీ కార్యదర్శి, ఓటరు సహాయ కేంద్ర ం, ఏఎన్ఎం, ఇద్దరు పోలీసులు అందుబాటులో ఉండనున్నారు. నియోజకవర్గంలో 20 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.

### మంథనిలో 288 ..

మంథని నియోజకవర్గంలో మొత్తంగా 2,36, 442మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,16,707 మంది, స్త్రీలు 1,19,716 మంది ఇతరులు 19మంది ఉన్నారు. 21మంది అభ్యర్థులు పోటీలో ఉండగా ఇక్కడ 288పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 37సెక్టార్లు 40రూట్లుగా విభజించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పో లింగ్ అధికారి, సహాయ అధికారి, ఇద్దరు చొప్పు న ఇతర పోలింగ్ అధికారులతో పాటుగా ఒక బూత్‌లెవల్ అధికారితో పాటుగా పంచాయతీ కార్యదర్శి, ఓటరు సహాయ కేంద్రం, ఏఎన్ఎం, ఇద్దరు పోలీసులు అందుబాటులో ఉండనున్నా రు. మంథని నియోజకవర్గంలో 51సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.


పెద్దపల్లి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది


పెద్దపల్లి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బస్సులో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

| నియోజకవర్గం | పోలింగ్‌కేంద్రాలు | రూట్లు | పోలింగ్ స్టాఫ్ |
|---|---|---|---|
| పెద్దపల్లి | 290 | 36 | 1160 |
| రామగుండం | 260 | 24 | 1040 |
| మంథని | 288 | 40 | 1152 |
| మొత్తం | 838 | 100 | 3352 |

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | పురుషులు | స్త్రీలు | సర్వీస్‌ఓటర్స్ | ఇతరులు | అభ్యర్థులు |
|---|---|---|---|---|---|---|
| పెద్దపల్లి | 2,54,266 | 1,26,046 | 1,28,212 | 264 | 8 | 17 |
| రామగుండం | 2,21,019 | 1,11,200 | 1,09,794 | 216 | 25 | 23 |
| మంథని | 2,36,442 | 1,16,707 | 1,19,716 | 155 | 19 | 21 |
| మొత్తం | 7,11,727 | 353953 | 357722 | 635 | 52 | 61 |

# ఎన్నికల వేళ పైలం

- బైండోవర్ అయ్యారా..? జాగ్రత్త
- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ చర్యలు
- ఇప్పటికే తహసీల్దార్ ఎదుట వందల మంది హాజరు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

తిమ్మాపూర్, నవంబర్ 29: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడడం ఎన్నికల కమిషన్ విధి. ఎవరైనా ఈ ప్రక్రియకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే కేసులు కూడా నమోదు చేస్తుంది. గొడవలకు కారణమయ్యే నేరస్వభావం ఉన్న వారిని బైండోవర్ చేయిస్తుండగా, దీనిని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటుంది.

తిమ్మాపూర్ మండలం గొడవలు, కక్షలకు తావు లేకుండా ఉన్నప్పటికీ ఎల్ఎండీ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు వేర్వేరుగా అన్ని పార్టీలకు చెందిన పలువురు లీడర్లు, నేర స్వభావం ఉన్న వారు, రౌడీషీటర్లు, బెల్ట్‌షాప్ నిర్వాహకులను ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అయిన తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. క్రిమినల్ ప్రొసిజర్ కోడ్‌లోని సెక్షన్ 107కింద బైండోవర్ చేశారు. ఇప్పటి వరకు తిమ్మాపూర్ మండలంలో పోలీస్ శాఖ తరపున 327, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 130మందిని బైండోవర్ చేశారు.

**ముందస్తు అస్త్రం:** ఎవరైనా వ్యక్తులతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఈ బైండోవర్ అస్త్రాన్ని ఉపయోగిస్తారు. బైండోవర్ కేసు నమోదైన వారు ఆరు నెలల్లోపు ఏదేనా కేసులో ఇరుకున్నా, వారిపై కేసు నమోదైనా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారికి ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా విధిస్తారు. కొన్నిసార్లు తహసీల్దార్ విచక్షణాధికారం ఉండే అవకాశం కూడా ఉంది. తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన పొనగంటి అజయ్ ఒక నేరంలో నిందితుడిగా ఉన్నాడు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇటీవల అతడిని ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి.. తహసీల్దార్ కనకయ్య ఎదుట బైండోవర్ చేశారు. ఈ క్రమంలో అజయ్ అక్టోబర్31న మరో నేరం చేయగా, ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి అరెస్ట్ చేసి, బైండోవర్ కేసు ఉన్నందున ఆయన నేర చరిత్రను వివరిస్తూ తహసీల్దార్ కనకయ్య ముందు ప్రవేశపెట్టారు. దీంతో అతడి నేర చరిత్రను పరిశీలించిన తహసీల్దార్, ఆరు నెలల జైలు శిక్ష లేదా, రూ.లక్ష జరిమాన చెల్లించాలని ఉత్తర్వులు అందజేశారు. దీంతో పొనగంటి అజయ్ రూ.లక్ష జరిమానాను బుధవారం చెల్లించాడు.

### ప్రశాంత వాతావరణం కోసమే

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు నేర చరిత్ర ఉన్నవారిని బైండోవర్ చేశాం. బైండోవర్ అయిన వాళ్లు ఏదైనా నేరం చేస్తే శిక్ష లేదా జరిమానా తప్పదు. శాంతిభద్రతలకు భంగం కలిగించిన ఎవరిపైనైనా కేసులు నమోదు చేస్తం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలి.

**-శీలం ప్రమోద్‌రెడ్డి, ఎస్ఐ, ఎల్ఎండీ**

# సంక్షేమ సర్కారుకు అండగా నిలువాలి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 29: అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్ఎస్ సర్కారుకు ప్రజలు ఈ ఎన్నికల్లో అండగా నిలువాలని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని పెద్దపాపయ్యపల్లి, చిన్నపాపయ్యపల్లి గ్రామాల్లో ఇంటింటా ఇరువురితో కలిసి తిరిగి బీఆర్ఎస్‌కు మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు. అనంతరం పట్టణంలోని పార్టీ ఆఫీస్‌లో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ రాష్ట్రంలో రెండు సార్లు గెలిచి, తెలంగాణ, హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందని గుర్తు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో అనేక చెక్ డ్యాంలు ఏర్పాటు చేసుకొని వ్యవసాయం రంగంలో అభివృద్ధి సాధించామన్నారు. మారుమూల గ్రామాలకు సైతం బీటీ, సీసీరోడ్లు వేసిందని, అండర్ డ్రైనేజీలు నిర్మించిందని తెలిపారు. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రూ.వందల కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టోకు తమ నాయకుడు కేసీఆర్ గ్యారెంటీ అని ధైర్యంగా చెబుతున్నామని.. మరి కాంగ్రెస్ 6 పథకాలకు గ్యారెంటీ ఎవరని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోకుండా, కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రజలకు రాజలింగారెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు భుసారపు బాపురావు, ఎండీ బాబా పాల్గొన్నారు.

### మద్యం పట్టివేత

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 29: పట్టణంలోని కుమ్మరివాడలో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా అక్రమ మద్యం లభించడంతో ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ జీ దుర్గాభవాని తెలిపారు. మోతే రవి, నారాయణ వద్ద రూ.6 వేల విలువైన మద్యం, బీర్లు లభించాయని, వాటిని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

CHANGE OF NAME
★I, SAYADA NAZIA BADAR, W/o. Mohammed Abdul Salam, R/o. 6-6-363, Saheth Nagar, Karimnagar, TS. Changed My Name as SAYYADA NAZIA BADAR, W/o. Mohammed Abdul Salam.
NT-313031

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194